

ఆంధ్రజ్యోతి





జగజ్జననికి నీరాజనం

మొదలైన శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా మొదలయ్యాయి. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని శ్రీబాలా త్రిపుర సుందరిదేవిని తొలిరోజు స్వర్ణకవచ కనకదుర్గగా దర్శనమిచ్చారిలా.. అక్కడ విద్యుత్ దీపాలంకరణ దృశ్యం..

సెంట్రల్ జైలు ఖైదీ పరారీ

మూత్ర విసర్జన కోసమంటూ సంకెళ్లతో సహా మాయం

7



ధాన్యం సేకరణ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

పన్ను తగ్గింపా..

కాకినాడలో ఓ షోరూమ్‌లో అమ్మకాలు



పండుగ ఆఫరా..

అంతా అయోమయం!





కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించిన విషయం తెలిసిందే. అయితే ఆ తగ్గింపు కొనుగోలు దారుకు లాభం చేకూర్చడం ఇప్పుడు చిక్కుముడిగా మారింది. జీఎస్టీ తగ్గక ముందు ఎంత ధర, తర్వాత ఏ మేరకు తగ్గిందనే విషయాలు దుకాణాల్లో ఎక్కడా కనబడడం లేదు. తొలిరోజు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అయితే అంతా అయోమయమే కనిపించింది. అసలే అసలు ధరను అమాంతం పెంచేసి భారీ తగ్గింపును చూపిస్తుంటారు. ఇప్పుడు కూడా ఆ మాదిరిగానే ధరలు ఉండడంతో జీఎస్టీతో తమకు ఏమి ఒరిగిందో వినియోగదారుడికి బోధపడడం లేదు. ఇక మార్కెట్‌లోనూ దసరా పండుగ ఆఫర్లు ప్రారంభించేశారు. దీంతో జీఎస్టీ తగ్గింపు ఎంత మేర, పండుగ ఆఫరు ఎంత డిస్కౌంటు అనే అంశాలు కలగాపులగంగా మారిపోయాయి.

- దసరా ఆఫర్లో కొట్టుకుపోయిన జీఎస్టీ తగ్గింపు ధరలు
- ట్యాక్స్ ఎంత మేర తగ్గిందో షాపుల్లో చూపని వైనం
- కొన్నిచోట్ల పాత స్టాకు పేరుతో దోపిడీ
- తొలిరోజు మార్కెట్‌పై ప్రభావం నిల్

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ/సామర్లకోట/తుని - ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ తగ్గింపు ప్రభావం దసరా ఆఫర్ల మధ్య కనిపించకుండా పోయింది. వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌కు దసరా ఆఫర్లు ప్రకటించారు. సోమవారం నుంచి జీఎస్టీ 2.0 అమలులోకి వచ్చినా పెద్దగా ధరలు తగ్గినట్టు కనిపించలేదు. కొన్ని వస్తువులకు మొత్తం జీఎస్టీ తీసేయడంతోపాటు కొన్నింటికి 5 శాతానికి పరిమితం చేయడంతో ధరల్లో స్పష్టమైన తేడా కనిపించాలి. కానీ ఏ షాపుల వద్దా కనీసం తగ్గింపు బోర్డులు పెట్టలేదు. ప్రభుత్వం బోర్డులు పెట్టాలని ముందే స్పష్టం చేసింది కూడా. ఇక దసరా పండుగ ఆఫర్లలో ఎక్కువగా టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లను ఏటా కొంటారు. వీటిపైనా జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో ఐదు స్లాబులుగా ఉన్న పన్నులను 5, 12 శాతాలతో రెండు స్లాబులకు తీసుకొచ్చింది. దీనిలో కార్ల నుంచి బిస్కట్ల వరకూ దాదాపు 375 వస్తువులను ఈ రెండు శ్లాబుల్లోకి తేగా, కొన్నింటికి సున్నా చేసింది. అయితే ఆ మేరకు వినియోగదారుడికి ఎంత లబ్ధి చేకూరిందో ఏ వస్తువుపై కూడా ఉండడం లేదు. ఉదాహరణకు ఆన్‌లైన్‌లో ఓ కంపెనీ 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీ ధర రూ.59,999గా చూపించి ఏకంగా రూ.30,001 రాయితీ ఇచ్చేస్తున్నారు. మరో కంపెనీ వాస్తవ ధరను రూ.73,990గా చూపించి ఏకంగా రూ.50 వేల డిస్కౌంటును ఇచ్చేస్తోంది. అసలు వాస్తవ ధర నిజమైనదేనా? జీఎస్టీ ఎంత తగ్గింది? పండుగ ఆఫరు ఎంత ఇచ్చారు? అనే అంశాలపై స్పష్టత కరువైంది. ఇక మార్కెట్‌లో కిరాణా తదితర సరుకుల విషయంలో కూడా ఇదే నడుస్తోంది. కొందరు వ్యాపారులు పాత స్టాకు, పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నామంటూ ధరలు తగ్గించకపోవడం గమనార్హం. కార్లకు మాత్రం వారం రోజుల నుంచి రూ.50 వేల నుంచి లక్షకుపైగా తగ్గినట్టు చెబుతున్నారు. టీవీలు, ఏసీలకు రూ.1500 నుంచి 3 వేల మాత్రమే తగ్గినట్టు కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధరలు దసరా ఆఫర్ల కింద ముందుగా ప్రకటించినవే. మాల్స్‌లోనూ ఇదే పరిస్థితి. అధికార యంత్రాంగం కదిలితే జీఎస్టీ తగ్గింపు మార్పు కనిపించే అవకాశం ఉంది. చిల్లర దుకాణాల్లో అసలు బిల్లులు ఇవ్వరు కాబట్టి అసలు ధర ఎంతో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌పై ప్రజలు ఎగబడడం వంటిదేమీ కనిపించలేదు. అయితే కాస్త స్పష్టత వచ్చాకే ఏదైనా కొనుగోలు చేయాలనే యోచనలో ఎక్కువ మంది వినియోగదారులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో తొలి రోజు ప్రభావం ఏమీ లేదు.

ఒకటి రెండ్రోజుల్లో మారతాయి...

జీఎస్టీ తగ్గింపు ధరల్లో తొలిరోజు గందరగోళం నెలకొనగా, ఒకటి రెండ్రోజుల్లో దాని ప్రభావం ఉంటుందని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి పాల ధరలు తగ్గిస్తున్నట్టు ఇప్పటికే చాలా కంపెనీలు ముందస్తుగా ప్రకటించాయి. అయితే మార్కెట్‌లో ఆ మేరకు తగ్గింపుతో కొందరు విక్రయాలు చేసినా, చాలాచోట్ల పాత ధరతోనే విక్రయించారు. ఇదేమని అడిగితే ప్యాకింగ్‌లో ఉండే మిస్టేక్ వల్ల సవరణ జరగలేదని అమలాపురంలో ఒక పాల వ్యాపారి చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో సవరణలు జరుగుతాయని సదరు కంపెనీ వారు చెప్పినట్టు తెలిపారు. వాస్తవానికి పాల ధర లీటరుకు రూ.2, నెయ్యి, పనీర్, బట్టర్ వంటి ఉత్పత్తులపై రూ.15 నుంచి రూ.30 మేర వస్తువును బట్టి తగ్గించారు. ఇక నిత్యావసర వస్తువులపై 18 శాతం ఉంచి ధరలను 5 శాతానికి తగ్గించినప్పటికీ కిరాణా, ఇతర ఉత్పత్తులపై ఇంకా తగ్గింపు అమలుచేసేందుకు వ్యాపారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. గతంలో తాము జీఎస్టీ చెల్లించి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిన వస్తువుల ధరలను తగ్గిస్తే నష్టపోతామనే భయంతో పాత రేట్లతోనే వసూలు చేస్తున్నారు. వెంటనే అధికారులు తనిఖీలకు సిద్ధం కాకపోతే ఇంకొంతకాలం పాత ఎమ్మార్పీలతో విక్రయించే అవకాశం ఉంది.

తగ్గితే పండగే..

జీఎస్టీ తగ్గింపుతో సుమారు 375 రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, వాహన, ఎలక్ట్రానిక్, డెయిరీలు, పాల ఉత్పత్తులపైనా ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. సెలూన్లు, వ్యాయామ-యోగా కేంద్రాలపై, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, సబ్బుల వంటి వ్యక్తిగత సౌందర్య ఉత్పత్తులపై పన్ను 18 శాతం నుంచి 5 శాతం తగ్గింది. జీఎస్టీ తగ్గుదలతో ప్రతి కుటుంబానికి వేలాది రూపాయలు ఆదా జరుగుతుందని కేంద్రం చెబుతోంది. నిజానికి పూర్తిస్థాయిలో ధరల తగ్గింపు అమలు జరిగితే ప్రజలకు లాభదాయకమే.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు : ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేదలు, మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని అమ్మవారిని సోమవారం ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ సరళీకృతం వల్ల ధరలు తగ్గి రైతులకు ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

ఖరీఫ్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం : కలెక్టర్

- ఖరీఫ్ సీజన్‌లో 5.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా
- అక్టోబరు 10 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి సన్నాహాలు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఖరీఫ్ సీజనులో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణ సన్నాహక సమావేశం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ సీజనులో 5.31 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, అయితే అందులో 4లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. గత ఖరీఫ్ సీజనులో 2.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని గుర్తుచేస్తూ ఈసారి అక్టోబరు 10 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,389 (100కిలోలకు), సాధారణ రకం ధాన్యానికి రూ.2,369 కనీస మద్దతు ధరగా నిర్ణయించారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 74 శాతం పంట నమోదు పూర్తయిందని, మిగిలినవి తక్షణమే పూర్తిచేయాలని సూచించారు. గత సీజనులో 221 రైతు సేవా కేంద్రాల ఏర్పాటుచేశారని, ఈసారి పంట దిగుబడి అంచనాల ఆధారంగా కేంద్రాల సంఖ్య నిర్ణయిస్తామన్నారు. గన్నీ బ్యాగ్‌లు కనీసం 10 రోజుల ముందుగానే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆకస్మిక వర్షాల కారణంగా రైతుల నష్టపోకుండా వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో టార్పాలిన్లు అందించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ పరికరాలు తప్పనిసరిగా అమర్చాలని, మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలన్నారు. రైతులకు నేరుగా ఆన్‌లైన్ చెల్లింపుల జరగనున్నాయన్నారు. ధాన్యం సేకరణలో అవినీతి, మధ్యవర్తుల జోక్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ నా దేవుడు : అనుశ్రీ



మీడియాతో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : 'జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నా దేవుడు. మళ్లీ రాజకీయ పునర్జన్మ ఇచ్చారు. నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయను. పార్టీని మరింత బలోపేతం చేస్తానని' జనసేన రాజమండ్రి అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ(అత్తి) సత్యనారాయణ స్పష్టం చేశారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు పార్టీ పెద్దలు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, జనసేన నేత హరిప్రసాద్ అండగా నిలబడ్డారని, రాజకీయంగా సహకరించారని తెలిపారు. కష్టకాలంలో కూడా తన వెంటే ఉన్న వారందరినీ మర్చిపోలేనని చెప్పారు. నూటికి నూరుశాతం సిటీలో జనసేనను బలోపేతం చేస్తానని, మేయర్ అభ్యర్థి ఎవరనేది తమ అధినేత నిర్ణయం తీసుకుంటారని ఆయన స్పష్టంచేశారు. తాను ఎప్పుడూ కూటమిలో బాధ్యతగా వ్యవహరించానని, ఇక ముందు అలానే ఉంటానని, పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతానని ఆయన వివరించారు. సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 178 అర్జీల స్వీకరణ

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ కీర్తి హెచ్చరిక

సీజన్ వ్యాధుల నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు.. ప్రజలూ జాగ్రత్త వహించాలని సూచన



అర్జీదారుని సమస్య వింటున్న కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం కలెక్టరేట్‌లో తొలిసారిగా పీజీఆర్ఎస్‌కు హాజరయ్యారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాగిన ఈ గ్రీవెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జవాబుదారీతనం కలిగిన పౌరసేవలు అందించే క్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను ఆమె హెచ్చరించారు. ప్రజలు ఎటువంటి వ్యయప్రయాసలకి లోను కాకుండా ఇంటి వద్దనే ఉండి తమ సెల్‌ఫోన్ ద్వారా 1100 టోల్‌ఫ్రీ నెంబరుకి కాల్‌చేసి తమతమ అర్జీల స్థితి తెలుసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడారు. శానిటేషన్ నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. వాటర్ ట్యాంకుల శుభ్రత, చెత్త నిల్వలు తొలగింపు వంటి చర్యలను పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లను చేపట్టాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 178 అర్జీలు వచ్చినట్టు చెప్పారు.

విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ.. కలెక్టర్‌కు వినతిపత్రం



తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు.. (పైన) కలెక్టర్ కీర్తికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ, డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపుమేరకు విద్యుత్ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. తొలుత స్థానిక ఈపీడీసీఎల్ సర్కిల్ ఆఫీసు వద్ద నుంచి కోటిపల్లి బస్టాండ్, ఆల్కాట్ గార్డెన్స్, బాలాజీపేట మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రాజమండ్రి సర్కిల్‌లోని అన్ని డివిజన్ల యూనియన్లు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం జేఏసీ జిల్లా చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు, కోచైర్మన్ పి.రామారెడ్డి, డివిజన్ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, కన్వీనర్ కె.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు.

వెంకటనగరం పంపింగ్ స్కీమ్‌కు రూ. 2.46 కోట్లు

జీవో ఇచ్చిన ప్రభుత్వం : అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): న్యూ వెంకటనగరం పంపింగ్ స్కీమ్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల కోసం 2025-26 సంవత్సరానికి రూ. 246.52 లక్షలకు పరిపాలనాపరమైన అనుమతులిస్తూ సోమవారం ప్రభుత్వం జీవో ఇచ్చినట్టు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. తాను ఇంతకుముందు ఈ పథకం దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని, దీని పరిధిలో 10 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, అందులో 6 వేల ఎకరాల ఆయకట్టు తమ నియోజకవర్గంలోనే ఉందన్నారు. పంప్‌హౌస్ స్టేజ్, 1,2,3ల ఓఅండ్ఎం కోసం రూ.194.86 లక్షలు, కాలువ కోసం రూ.15.66 లక్షలు కేటాయించినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో ఈ పంపు స్కీమ్ బాగుచేయించి, ఆయకట్టును పూర్తిగా సాగులోకి తీసుకొచ్చి రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు.

నన్నయ వర్సిటీ అక్రమాలపై విచారణ జరిపించండి

రాజానగరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చండి. మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే బత్తుల వినతి



రాజమహేంద్రవరం/కోరుకొండ సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రత్యేక టీమ్‌తో విచారణ చేయించి, కారకులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. సోమవారం లోకేశ్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే బలరామకృష్ణ నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరిస్తూ నియోజక వర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందివ్వాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. వీటికి ఆయన సానుకూలం స్పందించినట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. రాజానగరం, కోరుకొండ ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటుచేయాలని, గాదరాడ, శ్రీకృష్ణపట్నం, దివాన్‌చెరువు, రాజానగరం ప్రాంతాల్లో ఇంటర్ కాలేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. పుణ్యక్షేత్రం, గాడాల తుంగపాడు, వెదుళ్లపల్లి, గ్రామాల్లో ప్లస్ 2 నుంచి జూనియర్ కాలేజీగా మార్చాలన్నారు. కాకినాడ, రాజమండ్రి నగరాలకు మధ్యన ఉన్న రాజానగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐలు ఏర్పాటుచేసి వృత్తి విద్య ద్వారా కూడా యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. రాజానగరంలో ఎస్టీపీఐ, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటుచేయాలని, ముక్కినాడ, రాధేయపాలెం గ్రామాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేయాలన్నారు.

పవన్‌తో భేటీ



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం అమరావతిలో భేటీ అయ్యారు. సీతానగరంలో రెండు హైలెవల్ వంతెనల నిర్మాణాలకు రూ.10.5 కోట్లు నిధులు మంజూరు చేయాలని, సమగ్ర గ్రామీణాభివృద్ధి ప్రణాళికలో భాగంగా సీసీ రోడ్లకు రూ.148 కోట్లు, అంతర్గత డ్రైన్లకు, పుంతరోడ్లకు రూ.95.5కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు. ప్రతీ ఇంటికి మంచి నీటి సరఫరా కోసం రూ.682 కోట్లు ఇవ్వాలని, పుష్కరప్లాన్‌లో పంచాయతీ రోడ్లకు రూ.53.5 కోట్లు ఇవ్వాలన్నారు. వీటిపై పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించినట్టు బత్తుల వివరించారు.

ఆక్వా రైతులంతా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా రైతులంతా ఏపీఎస్‌డీఏ చట్టం -2020 ప్రకారం తమ చేపల చెరువుల వివరాలను తప్పనసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయించుకోవాలని, అక్టోబరు 15వ తేదీ చివర గడువు అని కలెక్టర్ డాక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం చేసిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ గడువులోపు లైసెన్స్ పొందకపోతే చెరువులకు విద్యుత్ రాయితీ రాదన్నారు. జిల్లాలో మొత్తం 3163 ఎకరాల ఆక్వా సాగు ఉందని, వీటిలో 2178 ఎకరాలకు 523 మంది రైతులు లైసెన్సులు పొందగా, 984 ఎకరాల కోసం 314 మంది లైసెన్స్‌లు పొందాలన్నారు. మత్స్య శాఖ దీన్ని పూర్తిచేయాలని ఆదేశించారు.



రత్నగిరిపై బాల అలంకరణలో వనదుర్గ అమ్మవారు

అన్నవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిపావంచా వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో ఉదయం 8 గంటలకు గణపతిపూజతో పండితులు క్రతువుకు శ్రీకారం చుట్టారు. రుత్వికులకు దేవస్థానం ఈవో సుబ్బారావు దీక్షా వస్త్రాలను అందజేశారు. అనంతరం జపాలు, పారాయణలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో లక్ష కుంకుమార్చన జరిపారు. తొలిరోజు అమ్మవారు బాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



బాలాత్రిపురసుందరిగా తలుపులమ్మ

తుని రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి వేకువజామునే ఆలయ పండితులు పూజలు జరిపారు. బాలాత్రిపుర సుందరీదేవిగా అనుగ్రహించిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



బ్రాహ్మిగా దర్శనమిచ్చిన మహాలక్ష్మి అమ్మవారు

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శృంగేరి శంకర మఠం నిర్వహణలో కాకినాడ జిల్లా పిఠాపురంలో కొలువైయున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ దంపతులు కలశస్థాపన, ఇతర పూజలు జరిపించారు. మహాలక్ష్మి అమ్మవారు తొలిరోజు బ్రాహ్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జగజ్జననికి నీరాజనం

అంగరంగ వైభవంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

పాదగయలో రాజరాజేశ్వరిగా అమ్మవారి దర్శనం

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వేంచేసియున్న రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శత చండీ యాగ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరుడు, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల సమయంలో అమ్మవార్లను అలంకరించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టుచీరలు, పండ్లు, పుష్పమాలలను అర్చకులకు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నాయకులు అందజేశారు.

రాజరాజేశ్వరీదేవి తొలిరోజు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాగణపతికి విఘ్నేశ్వర పూజ, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, కుంకుమార్చన జరిగాయి. పురుహూతికా అమ్మవారి శతచండీ యాగ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీచక్ర నవావరణార్చన సహిత సహస్ర పుష్పార్చన, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన జరిగాయి. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో పురుహూతికా అమ్మవారు



శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు





కాకినాడ శ్రీపీఠంలో లలితా సహస్రనామ కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మహాశక్తి యాగం ఆరంభం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీపీఠం ప్రాంగణం ఎరుపు, కాషాయ రంగు చీరలు ధరించిన మాతృమూర్తులతో నిండిపోయింది. లలితా సహస్ర నామం, అమ్మ నామస్మరణతో ఆ పరిసరాలు మార్మోగాయి. దేవీ శరన్నవరా త్రుల్లో భాగంగా రమణయ్యపేటలోని శ్రీపీఠం వెనుక సుమారు 5 ఎకరాల స్థలంలో శ్రీపీఠం వ్యవస్థాపకులు స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో 11 రోజుల పాటు జరిగే 3వ మహాశక్తి యాగం-2025 వేలాది మంది భక్తుల నడుమ సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఐశ్వర్యాంబిక అమ్మవారికి హారతి ఇచ్చి వెయ్యి కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలో భాగంగా వంద కోట్లు కుంకుమార్చన మహా క్రతువుకు శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామి మాట్లాడుతూ త్రికరణ శుద్ధితో తలపెట్టిన సంకల్పానికి మించిన బలం మరేదీ లేదన్నారు. అమ్మ అంటే అందరికీ ఇష్టమేనని, ఈ సృష్టిలో మాట్లాడలేని మూగజీవి కూడా అమ్మ అంటుందన్నారు. ఏ డాదిలో మూడు నవరాత్రులు వస్తాయన్నారు. సరస్వతి శక్తి అంటే జ్ఞానం ఇచ్చే శక్తి. వారాహి నవరాత్రుల్లో, గుప్త నవరాత్రుల్లో వర్షాలు పడతాయన్నారు. వర్షం అంటే లక్ష్మీదేవి అని, ఆదిలక్ష్మి సంపదకు సంకేతంగా ఉంటుందన్నారు. ఉదయం రుత్వికుల ఆధ్వర్యంలో సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 15వేల మంది భక్తులు హాజరయ్యారని అంచనా వేశారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఏఆర్ ఏఎస్పీ ఎస్.శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మహా శక్తి యాగ క్రతువుకు శ్రీకారం చుడుతున్న స్వామి పరిపూర్ణానంద



దేవీచౌక్‌లో అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

దేవీ'చౌక్' వైభవం...

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు స్వర్ణకవచ కనకదుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దేవీచౌక్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి.



దేవీచౌక్‌లో విద్యుత్ ధగధగలు



సామర్లకోట, ద్రాక్షారామల్లో విశేష అలంకరణల్లో బాలాత్రిపురసుందరి, మాణిక్యాంబ అమ్మవార్లు

సామర్లకోట, ద్రాక్షారామల్లో బాలాత్రిపురసుందరిగా...

సామర్లకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరి అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, కలశస్థాప నలను ప్రధానార్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), సన్నిధిరాజు వెంకటరమణ, అశొక్క రాజగోపాలశర్మ వేదమంత్రో చ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దుర్గాసప్తశతి పారాయణ, బాలాపరమేశ్వరీ మంత్రజపం, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి నవవరణార్చన జరిపారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు), తాతపూడి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచీ తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. శ్రీచక్ర పండితుడు వేమూరి సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేష హోమాలు చేశారు.

ద్రాక్షారామ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ శక్తి పీఠమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని, అర్చకులు సంకల్పం చేసి ప్రారంభించారు. అనంతరం వైదిక క్రతువులు, వేద పారాయణ, సూర్యనమస్కారాలు, మహా లింగార్చన, అమ్మవారి అనుష్ఠానాలు, శ్రీచక్ర నవావరణార్చన జరిపారు. సాయంత్రం సువర్ణ, రజత, విశేష పుష్పార్చన, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. రాత్రి కవాట బంధనం చేశారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిరిలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

నాంది ఫౌండేషన్‌తో నన్నయ ఎంవోయూ

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



ఎంవోయూ పత్రాలను పరస్పరం అందిపుచ్చుకుంటున్న దృశ్యం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రయోజనం చేకూరేవిధంగా నాంది ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. నన్నయ వర్శిటీలో వీసీ ప్రసన్నశ్రీ సమక్షంలో సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, నాంది ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ శ్రీలక్ష్మి ఎంవోయూలపై సంతకాలు చేసి పరస్పరం పత్రాలు అందిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా నన్నయ వర్శిటీతో నాంది ఫౌండేషన్ చేసుకున్న ఒప్పందం ద్వారా నన్నయ విశ్వవిద్యాలయం మెయిన్ క్యాంపస్, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లతో బాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. వర్శిటీ, అనుబంధ కళాశాలల్లోని 22 వేల మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలకు అవసరమైన శిక్షణను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కళాశాలల్లోని విద్యార్థులకు ఉచిత ఉపాధి డొమైన్ నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎంవోయూను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో విశ్వవిద్యాలయం శిక్షణా ఉపాధి కల్పన విభాగం అధికారి ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, వర్శిటీ అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో బుధవారం ఉదయం 9 గంటలకు 19 బాలురు, బాలికలకు జిల్లా స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్, ఖోఖో, హ్యాండ్ బాల్, రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతాయని స్కూల్ గేమ్స్ సెక్రటరీలు శ్రీనివాసరావు, సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 90593 17248, 96035 04337 నెంబర్లలో సంప్రదించాలని ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు కోరారు.

వయోలిన్ 'గంగా' ప్రవాహం



వయోలిన్‌పై కీర్తనలు వాయిస్తున్న గంగా శశిధరన్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సరస్వతి గాన సభ 122వ దసరా గానసభలు నగరంలోని సూర్యకళా మందిరంలో సోమవారం ప్రారంభ మయ్యాయి. బాల మాంత్రికురాలిగా కీర్తి గడించిన గంగా శశిధరన్ వయోలిన్ సోలో కచేరీ గంగా ప్రవాహంలా అత్యద్భుతంగా జరిగింది. అయిగిరి నందినితో ప్రారంభించి...హంసధ్వని రాగంలో దీక్షితుల వారి వాతాపిగణపతింభజే, శ్రీ రాగంలో త్యాగరాస్వామి వారి ఎందరో మహానుభావులు, రంజని, శ్రీరంజని, మనోరంజని రాగాల్లో వాగ్గేయకారుల దేవీ కృతులను ఆమె వాయించారు.గంగకు తృప్పుణిత్తుర శ్రీకాంత్ మృదంగంపై, తృప్పుణిత్తుర కుమార్ డోలుపై, మంజూర్ ఉన్నికృష్ణన్ ఘటంపై చక్కటి సహకారం అందించారు. సరస్వతి గానసభ సభ్యులు, అధిక సంఖ్యలో సంగీతప్రియులు కార్యక్రమాన్ని ఆద్యంతం వీక్షించి ఆనందించారు.

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్న దృశ్యం

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపును సోమవారం ప్రారంభించారు. మహాలయ పక్షాల సమయంలో 15 రోజులు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి పిండప్రదానాలు చేయడంతో పాటు వాటిని పుష్కరిణిలో కలిపారు. దీనితో పుష్కరిణిలో నీరు కలుషితమై వాసన వస్తుండడంతో నీరు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్నారు. నీటిని పూర్తిగా తొలగించి పుష్కరిణిని శుభ్రపరచి కొత్త నీరు పెడతామని పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. అప్పటివరకు పాదగయకు వచ్చే సాధారణ భక్తులతో పాటు భవానీ మాలధారులు జల్లు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు.

సంస్థను మోసం చేసిన ఉద్యోగి అరెస్టు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నం పెట్టే సంస్థకే కన్నం వేసిన కేటుగాడిని ప్రకాశంనగర్ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సీఐ బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరా ఫైనాన్స్ కంపెనీలో 2018లో గోకవరానికి చెందిన బల్లేని వీరబాబు చిరుద్యోగిగా విధుల్లో చేరాడు. అనంతరం మేనేజర్ స్థాయికి ఎదిగాడు. సంస్థ లావాదేవీల్లో పూర్తిగా పట్టు ఉండడంతో కస్టమర్‌ల ఆధార్‌కార్డులను అక్రమంగా వినియోగించి,ఫోర్జరీ సంతకాలతో వాహనాలకు ఫైనాన్స్ చేయడం మొదలు పెట్టాడు. తద్వారా వచ్చిన డబ్బులను సంస్థ ఖాతాలో జమ చేయకుండా జల్సాలకు వాడుకొన్నాడు. ఇలా సుమారు రూ.30 లక్షల అక్రమానికి పాల్పడ్డాడని సీఐ పేర్కొన్నారు.సంస్థ ఫిర్యాదుతో అతడిని అరెస్టు చేశామన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి: డీపీఎం

కడియం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయ విధానం వైపు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం తాతారావు తెలిపారు.మురమండ రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రసాయనిక ఎరువులు,పురుగుమందులు లేకుండా జీవామృతం, ఘనామృతం వంటి వాటితో సాగు చేయడం ద్వారా అటు రైతులకు తక్కువ పెట్టుబడితోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఈస్టిండియా పాలనలోనే దసరా వేళ.. కనకదుర్గమ్మపై ప్రేమతో నాణెం ముద్రణ

మండపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మనదేశాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ పాలిస్తున్న సమయంలో దసరా పండుగల సందర్భంగా కనకదుర్గమ్మ చిత్రాన్ని 1808లో ఆఫ్ అణా పేరిట రాగినాణేన్ని ముద్రించి హిందువుల పండుగల పట్ల వున్న అభిమానాన్ని చాటుకున్నారు. 1616 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ లక్ష్మీదేవి అమ్మవారి చిత్రాన్ని ఆఫ్ అణా రాగినాణంపై ముద్రించారు. సుమారు 404 సంవత్సరాల క్రితం లక్ష్మీదేవిని రాగి నాణంపై ముద్రించిన చరిత్ర ఈస్ట్ ఇండియా కంపెనీకి దక్కుతుంది. 1818లో ముద్రించిన కనకదుర్గమ్మ నాణెం 207 సంవత్సరాల తర్వాత కూడా చెక్కుచెదరకుండా ఉంది. అయితే దేవతామూర్తుల నాణాలు చెల్లుబాటు అయ్యేలా ముద్రించడం విశేషం. కాగా ఈ నాణాలు కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన తోరాటి నాగభూషణం వద్ద నేటికీ భద్రంగా ఉన్నాయి.







మంచు మైమరపించు...

మెట్టలో మంచు అందాలు మైమరపిస్తున్నాయి. తూర్పు కనుములు పచ్చదనాన్ని పరుచుకుని ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కాకినాడ జిల్లా తుని జాతీయ రహదారిపై సోమవారం మంచు తెరలు ఇలా కమ్ముకుని కొండలకు కొత్త వన్నె తెచ్చాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా...

- తుని రూరల్ (ఆంధ్రజ్యోతి)

ఇజ్రాయెల్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- ఒక్కొక్కరి నుంచి రూ.8 లక్షల వసూలు
- తప్పించుకునేందుకు చెల్లని చెక్కులు ఇచ్చిన వైనం
- బాధితుల్లో కొందరు కోనసీమ వాసులు
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు బాధితుల నిరసన



చెల్లని చెక్కులను చూపిస్తున్న బాధితులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాల పేరుతో మోసం చేయడంతో బాధితులు తెలంగాణలోని జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. బాధితుల కథనం మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో 2023 నవంబరు 12న సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరుకు చెందిన మరనాత మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ కె.సుదర్శన్ అబ్రహంను స్థానికుడొకరు వారికి పరిచయం చేశారు. ఇజ్రాయెల్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించిన అబ్రహం రూ.8 లక్షల చొప్పున 42 మంది వద్ద డబ్బు వసూలు చేశాడు. 2024 జూలై 9న వారిని ఇజ్రాయెల్‌కు పంపించాడు. అక్కడ ఉద్యోగాలు ఇప్పించక పోవడంతో వారంతా జూలై 16న స్వదేశానికి తిరిగి వచ్చారు. మరుసటి రోజు వారందరూ ధరూరుకు వచ్చి అబ్రహంను కలిసి తమ డబ్బు తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో వారందరికీ వేర్వేరు తేదీలతో చెక్కులు ఇవ్వడంతో స్వస్థలాలకు వెళ్లిపోయారు. అయితే చెక్కులేవీ చెల్లకపోవడంతో అప్పటి నుంచి పలుమార్లు బాధితులు పాస్టర్‌ను ఫోన్లలో సంప్రదిస్తూనే ఉన్నారు. కొందరు స్వయంగా వచ్చి డబ్బులడిగారు. కొన్నాళ్లకు ఫోన్ ఎత్తకపోవడంతో ఈ నెల 13న 15 మంది బాధితులు ధరూరులోని మరనాత చర్చికి వచ్చారు. పాస్టర్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డబ్బులు ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని చెప్పి, చర్చి పక్కనున్న ఓ హాల్‌లో ఉంటున్నారు. కాగా.. రెండ్రోజుల క్రితం పాస్టర్ కుటుంబ సభ్యులు 100కు ఫోన్ చేసి తమ ఇంటిపై కొందరు దౌర్జన్యానికి యత్నిస్తున్నారని చెప్పారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ 'ప్రజావాణి' కార్యక్రమంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఒంటరి మహిళల మెడలోని గొలుసులే టార్గెట్

11 చోట్ల చోరీలు

కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరి దొంగల అరెస్ట్

అత్తిలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అత్తిలి తదితర ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు తణుకు రూరల్ సీఐ బి.కృష్ణమోహన్, అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి పోలీస్ స్టేషన్లో సీఐ మాట్లాడుతూ కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన అనుబోయిన నాని బాబు, పనసపాడు గ్రామానికి చెందిన బొమ్మరాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని గొలుసులు చోరీ చేసి ఎత్తుకెళ్లడం వీరి నైజమని అన్నారు. తుని, అన్నవరం, రాజోలు, రావులపాలెం, అత్తిలి, ఇరగవరం, తణుకు తదితర ప్రాంతాలలో 11 చోట్ల దొంగతనాలు చేసినట్లు తెలిపారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద మహిళ మెడలో గొలుసు దొంగిలించి పారిపోతుండగా మంచిలి గ్రామం వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి నుంచి 223 గ్రాముల బంగారం, మారుతి కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను తణుకు కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ కేసులో కానిస్టేబుల్ ఎస్.కె.అన్వర్, మలక శ్రీనివాస్, వై.శివకృష్ణ సహకరించినట్టు వారు తెలిపారు.

గంధం చెట్లు నరికిన ముగ్గురు మధ్యప్రదేశ్ వాసుల అరెస్ట్

రూ.10,25,000 విలువైన చెట్టు మానులు స్వాధీనం



రాజానగరం పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నందరాడలోని ఒక తోటలో గంధం చెట్లు నరికిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ నిందితుల వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన తన్నీరు విజయ కుమార్‌కు రాజానగరం మండలం నందరాడ గ్రామంలో 12 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో కొబ్బరి, మామిడి, టేకు, ఎర్ర చందనం, శ్రీగంధం చెట్లను పెంచుతున్నారు. సదరు తోటలో దొడ్డా సోమేశ్వరరావు సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16న సోమేశ్వరరావు పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోయాడు. 19న ఉదయం తోటమాలి పిన్నమరాజు సత్యనారాయణ తోటలోకి వెళ్లి చూడగా తోటలో ఉన్న 2 గంధపు చెట్లను ఎవరో నరికి తీసుకెళ్లడం గమనించి సోమేశ్వరరావుకు ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో సోమేశ్వరరావు తోటలోకి వెళ్లి చూడగా గంధం చెట్టు నరికేసి అపహరించినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంధం చెట్లను మొదలకు కోసి చెట్టు చివరి భాగం వదిలిపెట్టి మొదలు భాగాన్ని ముక్కలుగా నరికి దొంగిలించారు. ఈ మేరకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పర్యవేక్షణలో ఎస్.ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మధ్యప్రదేశ్ నుంచి వచ్చి సంచార జీవనం చేస్తున్న వ్యక్తులను అనుమానితులుగా గుర్తించి ఈ నెల 21న దివాన్ చెరువు సమీపంలో పట్టుకుని విచారించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కట్ని జిల్లాకు చెందిన జాలిస్ ఆదివాస్, శివరాజ్ ఆదివాసీ, ఉల్లిష్ అలియాస్ టీటూ అనే ముగ్గురిని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి గంధం చెట్ల మాను ముక్కలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.10,25,000 ఉంటుందన్నారు.

ఆ లేఖతో మాకు సంబంధం లేదు

మావోయిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి లచ్చన్న ప్రకటన


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ
పత్రికా ప్రకటన తేదీ: 22-సెప్టెంబర్-2025

మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ

చింతూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఇటీవల మావోయిస్టుల పార్టీ పేరిట విడుదలైన లేఖతో తమకు ఎటు వంటి సంబంధం లేదని మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న సోమవారం ఖండించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేరిట విప్లవ సంతకంతో ఓ లేఖ విడుదలైందన్నారు. ఆ లేఖలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, దుమ్ముగూడెంకు చెందిన పలువురి రాజకీయ నాయకులు, ఓ పత్రికా విలేకరిని కూడా హెచ్చరించడం జరిగిందని లచ్చన్న పేర్కొన్నారు. ఇదంతా కొంతమంది పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారమని, ఏజెన్సీలో గందరగోళం సృష్టించేందుకే ఈ తరహా ప్రకటనలు విడుదల చేస్తున్నారని మండిపడ్డారు.

ఇసుక దొంగతనం చేసిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నమ్మించి ఇసుక దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన గూడపాటి రాజశేఖర్ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో ప్రభుత్వం మంజూరుచేసిన దుర్గా వెంకటరమణ సాండ్ ట్రేడర్స్ ద్వారా ఓపెన్ ఇసుకర్యాంపు నుంచి ఇసుక తీసుకువచ్చి స్టాక్ పాయింటులో నిల్వ చేసి అక్కడ నుంచి విశాఖ, అనకాపల్లి జిల్లాలలోని ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇసుక సరఫరా చేస్తున్నాడు. స్టాక్ పాయింటు వద్ద భీమవరానికి చెందిన కునిపూడి శ్రీనివాస్ అలియాస్ చిరుత శ్రీనుని ఏపీ ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్ ర్యాంపులో గుమస్తాగా నియమించింది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ తన అల్లుడైన పంపన గణపతికి సొంత లారీలు ఉన్నాయని చెప్పి రాజశేఖర్‌కు పరిచయం చేసి ఇసుక రవాణాకు నియమించాడు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు స్టాక్ పాయింటు మూసివేసిన తరువాత ఇద్దరు కలిసి సుమారు 196 ట్రిప్పులు రూ.6,47,881.92లు విలువైన ఇసుకను మోసగించి స్టాక్ పాయింటు నుంచి దొంగతనంగా తరలించారు. అంతేకాకుండా ఇసుక రవాణా నిమిత్తం రాజశేఖర్ వద్ద రూ.8లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. పంపన గణపతి కుటుంబ అవసరాల నిమిత్తం లారీని దస్తావేజు అగ్రిమెంటు చేసుకుని మరో రూ.15 లక్షలు తీసుకున్నాడు. లారీని ఫిర్యాదుపేరుపై రిజిస్ట్రేషన్ చేయకుండా రాత్రి సమయంలో లారీని ర్యాంపు నుంచి నవాబుపాలెం తీసుకువెళ్లిపోయాడు. మొత్తం రూ.30 లక్షల వరకు మోసగించినట్టు ఇద్దరిపై రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరిరావు పేర్కొన్నారు.

బోనాల సంబరం



రౌతులపూడిలో బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు




తునిరూరల్: ఎన్.సూరవరం గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

రౌతులపూడి/ తునిరూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అధిక సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించారు. అలాగే తుని మండలం ఎన్.సూరవరం గ్రామంలో కూడా బోనాల సంబరం జరిగింది. టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి నాగ సోమరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా మహిళలు బోనాలను శిరస్సును ధరించి గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేశారు.

లారీని ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

మరొకరికి గాయాలు

దివాన్‌చెరువు వద్ద ఘటన

దివాన్‌చెరువు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద జరిగిన ప్రమాదంలో రాజమహేంద్రవరం మోడల్ కాలనీకి చెందిన బత్తుల తారకరాజు (27) మృతిచెందాడు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి తారకరాజు స్నేహితులతో కలసి రాజానగరం వైపు నుంచి లాలాచెరువు వైపునకు మూడు బైక్‌లపై వెళ్తున్నారు. స్థానిక జీరోపాయింట్ వద్ద తారకరాజు ప్రయాణిస్తున్న వాహనాన్ని అతడి స్నేహితుడు పల్లా గోపినాథ్ నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన తారకరాజు అక్కడికక్కడే మృతిచెందగా గోపీనాథ్‌కు గాయాలయ్యాయని బొమ్మూరు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి మృతుడి బంధువులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



లభ్యమైన మృతదేహం

నిడదవోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ మొదటి వీధిలో సోమవారం దాదాపు 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బహుశా అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై అనుమానాస్పద మృతికేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

గ్యాస్ పైపులైన్ లీకేజీ

గుర్తించిన రైతులు... అప్రమత్తమైన అధికారులు



కె.పెదపూడిలో గ్యాస్ లీకేజీ దృశ్యం

అంబాజీపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి- కొత్తపాలెం వద్ద ఉన్న అప్పర్ కౌశిక గట్టుపై సోమవారం ఓఎన్జీసీకి చెందిన గ్యాస్ పైపులైన్ స్వల్పంగా లీకైంది. వ్యవసాయ పనుల నిమిత్తం ఆటుగా వెళ్లే రైతులు కొంత మంది గ్యాస్ లీకేజీని గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన అధికారులు లీకేజీ విషయాన్ని ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించగా అయినవిల్లి మండలం మడుపల్లి నుంచి మామిడికుదురు మండలం పాశర్లపూడి వెళ్తున్న పైపలైన్ లీకేజీని గుర్తించి అరికట్టారు. స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

'మత్స్యకార సమస్యలపై సమష్టి పోరాటం'

కొత్తపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, అమీనబాద్ తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకార నాయకులు తమ సమస్యలపై సమష్టి పోరాటం చేసేందుకు సోమవారం సమావేశమయ్యారు. తీరప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల కారణంగా సముద్రంలో మత్స్య సంపద లభ్యం కాకపోవడంతో తమకు జీవనోపాధి పోయిందని ఆవేదన చెందారు. సుమారు 500మంది మత్స్యకారులు ఉప్పాడ నుంచి కాలినడకన కొత్తపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఉప్పాడ- అమీనబాద్ బీచ్ రోడ్డులో మంగళవారం తలపెట్టిన ఆందోళనకు అనుమతి ఇవ్వాలని ఎస్ఐ జి.వెంకటేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మిడి జాన్, నక్కా మణికంఠ, సూరాడ ఎల్లాజీ, చోడిపల్లి ప్రసాద్, సూరాడ రాజు, మేరుగు భూషణం, ఓసిపల్లి అప్పన్న, గంటా విజయకుమార్ పాల్గొన్నారు.

తిరుపతి-విశాఖ మధ్య 20 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-విశాఖ మధ్య సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు నవంబరు 25 వరకూ 20 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్టు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది.

08584 నంబరు గల రైలు తిరుపతి-విశాఖపట్నం మధ్య నవంబరు 25 వరకూ ప్రతీ మంగళవారం తిరుపతిలో రాత్రి 9.50 గంటలకు బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 10 ట్రిప్‌లుగా నడువనుంది. అలాగే 08583 నంబరు గల రైలు విశాఖపట్నం-తిరుపతి మధ్య నవంబరు 24 వరకూ ప్రతీ సోమవారం తిరుపతిలో రాత్రి 7.10 గంటలకు బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 10 ట్రిప్‌లుగా నడువనుంది. 08583 నంబరు గల ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నంలో ప్రతీ సోమవారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరుతుంది. దువ్వాడ, అనకాపల్లి, యలమంచలి, అన్నవరంనకు రాత్రి 9.35 గంటలకు చేరుతుంది, సామర్లకోటకు రాత్రి 10.02కి చేరుతుంది. రాజమహేంద్రవరానికి రాత్రి 10.52 గంటలకు చేరుతుంది. నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, శ్రీకాళహస్తి, రేణిగుంటల మీదుగా తిరుపతికి మరుసటి రోజు మంగళవారం ఉదయం 10.12 గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబరు 23, 30 అక్టోబరు 7, 14, 21, 28 నవంబరు 4, 11, 18, 25 తేదీలలో విశాఖపట్నం నుంచి 10 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది.

08584 నంబరుగల తిరుపతి-విశాఖపట్నం మధ్య వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతిలో ప్రతీ మంగళవారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, నిడదవోలు మీదుగా రాజమహేంద్రవరానికి ఉదయం 6.43 గంటలకు, సామర్లకోటకు 7.28, అన్నవరానికి 7.53 గంటలకు చేరుతుంది. యలమంచలి, అనకా పల్లి, దువ్వాడల మీదుగా విశాఖపట్నం బుధవారం ఉదయం 10.15 గంటలకు చేరుతుంది. ఈ వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబరు 22,29 అక్టోబరు 6,13,20,27 నవంబరు 3,10,17,24లలో 10 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది.

సెంట్రల్ జైలు ఖైదీ పరారీ



ప్రభాకర్ (ఫైల్)

దేవరపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వాయిదా నిమిత్తం విజయవాడ తీసుకెళ్లి తిరిగి రాజమహేంద్రవరం తీసుకొస్తున్న సమయంలో ఖైదీ బత్తుల ప్రభాకర్ పరారయ్యాడు. దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారి పక్కనున్న గోదావరి రెస్టారెంట్ వద్ద టిఫిన్ చేసేందుకు సోమవారం రాత్రి ఎస్కార్ట్ వ్యాను ఆగింది. ఇదే అదునుగా భావించిన ప్రభాకర్ మూత్ర విసర్జన కోసం తీసుకెళ్లమని అడిగి తప్పించుకుని పరారయ్యాడు. దీనిపై దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభాకర్ కోసం గాలిస్తున్నామని, పోలీసుల నుంచి తప్పించుకున్న సమయంలో చేతికి సంకెళ్లు, వైట్ కలర్ టీషర్టు, బ్లాక్ కలర్ ట్రాక్‌ను ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు 9440796584, 9440796624 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

రాయవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితుడిగా ఉండి పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. గంజాయి కేసులో ఏ6 నిందితుడిగా ఉన్న మందపల్లి డానియేల్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పరారీలో ఉన్నాడు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో రాయవరం పోలీసులు డానియేల్‌ను సోమవారం కోనసీమ జిల్లా మండపేట బైపాస్ రోడ్డు సమీపంలో బోర్డు స్కూల్ రోడ్డులో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు.

టీడీపీ రాజమహేంద్రవరం అధ్యక్షుడిగా రాంబాబు



టీడీపీ నగర నూతన కమిటీతో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాజమహేంద్రవరం నగర అధ్యక్షుడిగా మజ్జి రాంబాబును ఖరారు చేస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నగర కమిటీ ఉత్తర్వులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రకటించారు. నగర అధ్యక్షుడిగా రాంబాబు, ఉపాధ్యక్షులుగా ఉప్పులూరి జానకీరామయ్య, ప్రధాన కార్యదర్శిగా బుడ్డిగ రాధా, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కంటిపూడి శ్రీనివాస్, కరగాని వేణు, మొకమాటి సత్యనారాయణ, కార్యదర్శులుగా కడలి రామకృష్ణ, ద్వారా పార్వతిసుందరి, మహ్మద్ అస్లం, కోశాధికారిగా శెట్టి జగదీష్‌లను నియమించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. అందరి ఆమోదంతోనే ఈ కమిటీ నియామకం జరిగిందన్నారు. నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. ఈ సందర్భంగా తమ నియామకం పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావులకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిక్కి నాగేంద్ర, యిన్నమూరి దీపు, నక్కా దేవి వరప్రసాద్, కోసూరి చండిప్రియ, దాస్యం ప్రసాద్, కొల్లినాని తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తొలగింపుతో పాలసీదారులకు మేలు



ఎల్ఐసీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ఏజెంట్లు, అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో ఎల్ఐసీపై జీఎస్టీ తొలగింపుతో అటు ఏజెంట్లుకు, ఇటు పాలసీదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఏజెంట్లు సంఘం అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా అన్నారు. బీమా పాలసీలపై జీఎస్టీ తొలగింపుతో రూరల్ ఎల్ఐసీ కార్యాలయంలో లియాఫి ఏజెంట్లు సంఘం నాయకులు, ఉద్యోగులు, విస్తరణాధికారులు సోమవారం కేకు కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా సాయిబాబాతోపాటు రూరల్ బ్రాంచిమేనేజర్ రఘుకుమార్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలో దిగ్గజమైన ఎల్ఐసీ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైందని, దానిపై జీఎస్టీ తొలగించడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ అబ్రహం, విస్తరణాధికారి శ్రీకాంత్, ఫులగుర్త సాయిబాబా, పట్నాయక్, ఏజెంట్లు యూనియన్ నాయకులు వై.మోహన్, ఐ.రవికుమార్, కొత్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా కరాటే విజేతలకు మంత్రి అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగిన ఆలిండియా కరాటే చాంపియన్ షిప్ 2025లో సత్తా చాటి గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్స్ సాధించిన రాజమహేంద్రవరం క్రీడాకారులను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. పోటీలలో వివిధ కేటగిరీలలో అండర్-10,14,17,19 విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన కె.శ్రీలాస్య, కె.భవిష్య, టి.శ్రీగణేష్, పి.పూజ,ఎన్.శ్రీలక్ష్మి లత, కె.లక్ష్మి భవానీలను, సిల్వర్ మెడల్ సాధించిన బి.ఏంజిలరిబిక,ఎం.జాన్ మలాకి, బ్రాంజ్ మెడల్ సాధించిన కె.చర్విక్ రోషన్, ఏజీ వికాస్ నారాయణ, జె.వీరదుర్గశశాంక్, జె.నవ్యశ్రీ లక్ష్మీదుర్గ సోమవారం మంత్రి దుర్గేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని ప్రత్యేకంగా అభినందించి మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే మాస్టర్ పిల్లి అరుణ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎం.నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకయ్యపేటను ప్రత్యేక పంచాయతీ చేయండి



వెంకయ్యపేట గ్రామస్థులు, జేఏసీ సభ్యులు

అధికారులకు గ్రామస్థులు వినతుల సమర్పణ

కడియం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేయాలంటూ వెంకయ్యపేట గ్రామస్థులు, గ్రామ జేఏసీ సభ్యులు సోమవారం అధికారులను కలిశారు. జిల్లా కలెక్టర్, పంచాయతీ కార్యాలయాల్లోను, కడియం తహశీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లోను అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకయ్యపేట జేఏసీ సభ్యులు దాసరి శ్రీనివాస్, గట్టి వెంకన్నబాబు, అయితిరెడ్డి వెంకటస్వామి, రంబాల దుర్గారావు, ఆకుల రాంబాబు, పులిదిండి రాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి రూ.25 వేలు ఆర్థిక సాయం



కార్యక్రమంలో చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, వ్యాపారవేత్త జయచంద్ర

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థికి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ప్రముఖ వ్యాపారవేత్త గుత్తుల జయచంద్ర అందించారు. స్థానిక వెంకటేశ్వనగర్‌లోని ఏపీ శెట్టిబలిజ సంక్షేమ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జయచంద్ర పుట్టినరోజు సందర్భంగా సోమవారం పేద విద్యార్థి చీకట్ల మణికంఠకు రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా జయచంద్ర సామాజిక సేవా దృక్పథాన్ని సత్తిబాబు అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పితాని భానుచందర్, గుత్తుల ఫణి, గుత్తిర్తి పాండురంగ, పిల్లి శ్రీను, అలంకార్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అవార్డు గ్రహీతకు ఎంపీ సత్కారం



వీర్నాల కృష్ణను అభినందిస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 14న జరిగిన 37వ జాతీయ వార్షికోత్సవాల్లో బుర్రకథ కళా రంగంలో వీర్నాల కృష్ణ చేసిన సేవలను గుర్తించి ఎన్టీఆర్ జాతీయ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బుర్రకథ కళాకారుడు వీర్నాల కృష్ణను సోమవారం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సత్కరించారు. ఒకే వేదికపై కృష్ణ కళా సేవారత్న అవార్డును సాధించడంతోపాటు తన తండ్రి పేరుమీదుగా పురస్కారం అందుకున్నందుకు ఆనందిస్తున్నానని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు, జిల్లా బేడ బుడ్గ జంగాల అధ్యక్షుడు వి.ఏసు, బీజేపీ నాయకులు తగరం సురేష్ బాబు, మట్టా వెంకటరమణ, రాష్ట్ర కళాకారుల సంఘం మహిళా ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రక్తదానం

గోకవరం, సెప్టెంబరు 22(ఆంధ్ర జ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు సోమవారం రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు నాయకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మట్టా మంగరాజు, ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ ఈ నెల ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.



రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

శ్రీ దుర్గాయై నమః



దివాన్‌చెరువులో అమ్మవారిని దర్శించుకుంటున్న బత్తుల వెంకటలక్ష్మి

- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- దుర్గాదేవి ఆలయాల్లో విశేష పూజలు
- తొలి రోజు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి మహోత్సవాలు పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దివాన్‌చెరువులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ సముదాయాల్లో కొలువై ఉన్న కాశీ అన్నపూర్ణాదేవి ఆలయంలో కలశస్థాపనతో నవరాత్రిఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజైన సోమవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష కుంకుమ పూజలు చేసి హారతులిచ్చారు. అలాగే గ్రామంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మందిరాల్లో అమ్మవారిని జనసేన పార్టీ నాసేన కోసం నావంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాలచర్లలోని దుర్గాదేవి ఆలయం, లాలాచెరువు హౌసింగ్‌బోర్డులోని శ్రీ బాలా త్రిపుర సుందరీ ఆలయం, స్థానిక శ్రీవిశ్వేశ్వరీదేవి ఆలయంలో, కొత్తతుంగపాడు, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో దేవీ నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోకవరం: గోకవరంలోని వీరభద్రుని గద్దెలో కనకదుర్గమ్మవారు మొదటిరోజున బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయార్చకులు పేరూరి వెంకటాచారి దంపతులతో అమ్మవారి కలశ స్థాపనతో పూజలు ప్రారంభమయ్యాయి. ఓ భక్తుడి సహకారంతో ఆలయాన్ని పుష్పాలంకరణ చేశారు. రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ అడపా లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులతో అమ్మవారికి సమర్పించిన గజమాలను ముందుగా గ్రామమంతా ఊరేగించి పూజలు చేసిన అనంతరం అమ్మవారికి అలంకరించారు. ఆర్యవైశ్య యూత్ సభ్యులు సుమారు 12 కిలోల లడ్డూను అమ్మవారికి అందించారు. మహిళలు ఆలయంలో లలితా సహస్ర పారాయణం నిర్వహించారు.

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెంలోని శ్రీభువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి సర్పంచ్ అన్నందేవుల చంటి, మాజీ ఎంపీపీ విజయ దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు.కడియం దేవీచౌక్ సెంటర్లో దుర్గాదేవీ ఆలయం వద్ద శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. దుళ్ల, వీరవరం, వేమగిరి, జేగురుపాడు, బుర్రిలంక గ్రామాల్లోని దుర్గాదేవీ ఆలయాల్లోను, కడియపులంక హరిహర క్షేత్రంలో ఉన్న శ్రీఅపర్ణాదేవి ఆలయం,దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు,భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

బిక్కవోలు: బిక్కవోలులోని జువ్వలదొడ్డిలో వున్న శ్రీరాజరాజేశ్వరి పీఠంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. స్థానిక కరణం గారి మేడలోను, ఊలపల్లిలోని ఇటుకల బట్టీ వద్ద కనకదుర్గమ్మ పీఠంలోను దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఊలపల్లి వెలంపేటలో తయారు చేసిన దుర్గమ్మను భక్తులు అక్కడ నుంచి తీన్‌మార్ డప్పులతో గ్రామోత్సం జరిపి పీఠంలో నెలకొల్పారు.

అనపర్తి: అనపర్తిలో వీరుళ్లమ్మ ఆలయం వద్ద త్రిశక్తి పీఠం, మాజీ జడ్పీటీసీ కర్రి శేషారత్నం నివాసంలో ఏర్పాటు చేసిన ఓంశక్తి అమ్మవారి పీఠంలో విశేష పూజలు నిర్వహించారు. దేవీచౌక్, మహాలక్ష్మి ఆలయాల్లో అమ్మవారు బాలా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు

రంగంపేట: రంగంపేటలో జగనన్న కాలనీలో లక్ష్మీగణపతి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మందిరంలో దేవి విగ్రహాన్ని పెట్టి నవరాత్రులు ప్రారంభించారు. ప్రతి రోజు అమ్మవారికి భిన్నమైన అలంకారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు,హారతులు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలోని రావులచెరువు గట్టున నెలకొల్పిన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఈ సందరంగా అమ్మవారిని 108 కొత్త చీరలతో అలంకరించారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే చక్రద్వారబంధం, తూర్పుగోనగూడెం, రాధేయపాలెం, సూర్యారావుపేట, పల్లకడియం, కానవరం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు భక్తుల కోలాహలంతో ఆధ్యాత్మిక సందడిని సంతరించుకున్నాయి.

కోరుకొండ: కోరుకొండ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, కాపవరం రాజరాజేశ్వరి దేవి ఆలయం, గాదరాడలోని ఓం శివశక్తి పీఠం వద్ద కలశ స్థాపనతో దేవీ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, లలితసహస్ర నామ కుంకుమార్చనలు జరిగాయి. గాదరాడలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కుటుంబ సభ్యులు పేరున కలశ స్థాపన చేశారు. కాపవరంలో అనువంశక ధర్మకర్త నీరువర్తన విజయ భాస్కరరావు దంపతులు కలశ స్థాపన చేశారు. అలాగే జంబుపట్నం, గాడాల, శ్రీరంగపట్నం, దోసకాయలపల్లి, బూరుగుపూడి, కణుపూరు, నర్సాపురం, కాపవరం గ్రామాల్లో దేవీ శరన్నవ రాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పూజల్లో ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, కోరుకొండ, కాపవరం సర్పంచ్‌లు కర్రి లక్ష్మీసరోజ, జాజుల రాము తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్ పాలెంలో పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్ చంటి, విజయ దంపతులు



అనపర్తి: బాలాత్రిపుర సుందరిగా మహాలక్ష్మమ్మ



రాజానగరం: చీరల అలంకరణలో వాసవీ మాత



గోకవరంలో గజమాలను ఊరేగిస్తున్న దృశ్యం

సిద్ధాంత గ్రంథాల ప్రచారం

అనపర్తి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని రాజమండ్రి త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు అన్నారు. సోమవారం అనపర్తిలో సిద్ధాంత గ్రంథాల ప్రచార పరిచయ కార్యక్రమాలను నిర్వహించారు.కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శేఖరబాబు, ప్రతినిధులు శాంతరాజు, సోమి నాయుడు, నాగేశ్వరరావు, లక్ష్మీ నారాయణ లోహిత, విజయ్ తదితరులు పాల్గొన్నారు,

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి ఘాట్‌లోని రాజమండ్రి వర్తక స్వచ్ఛంద సేవా సంస్థ, చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక క్వారీ మార్కెట్ వద్ద జడ్పీ హైస్కూలుకు రూ.50 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను హెచ్‌ఎం టి.సూర్యచంద్రరావుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఈ.మురళీధర్, కోసూరి సుబ్బరాజు, అశోక్‌కుమార్‌జైన్, బాలనాగు బలేష్ గుప్తా, ఎం.వెంకటరాజు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో ప్రజాభిప్రాయం ఎంతో ముఖ్యం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏసీ రామలింగేశ్వర్

- కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్
- వివిధ సమస్యలపై 20 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజాభిప్రాయం ఎంతో ముఖ్యమని మునిసిపల్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీ లను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాల సేకరణ చేస్తోందన్నారు. అర్జీలను నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కారించాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. అర్జీలు పరిష్కారం కాలేదనే ఫిర్యాదు ఎక్కడా రాకూడదన్నారు. పదేపదే రీఓపెన్ అవుతున్న కేసులపై సంబంధిత శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 20అర్జీలు స్వీకరించామన్నారు. వాటిలో ఇంజనీరింగ్ విభాగానికి 4, టౌన్ ప్లానింగ్‌కు 4, పబ్లిక్ హెల్త్‌కి 7, వార్డు సచివాలయాలకు 4, రెవెన్యూకు 1 అర్జీ వచ్చాయని తెలిపారు. అనంతరం ఫీవర్ సర్వేపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంతశాతం పూర్తయిందో అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కూడా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రామలింగేశ్వర్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, సిటీప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఆర్వో సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం: ఆర్డీవో

పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలు చూపించాలని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 17 అర్జీలను స్వీకరించారు. ప్రజలు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు 1100కు కాల్ చేసి అర్జీ స్థితిని తెలుసుకోవాలన్నారు. సమస్యలపై అధికారులు అలసత్వం వహించకుండా సత్వర పరిష్కారం చూపించాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఈ స్మార్టు రేషన్‌కార్డుల పంపిణీ 90శాతం జరిగిందని, మిగిలిన వాటిని వేగంగా పంపిణీ చేయాలన్నారు. 65ఏళ్లు పైబడి వృద్ధులకు రేషన్ ఇంటికే సరఫరా చేయాలని సూచించారు. ఎక్కడైనా లోపాలుంటే వెంటనే సరిచేసుకోవాలని అధికారులకు సూచించారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మెకు సన్నద్ధం



కలెక్టర్‌కు వినతిత్రం అందజేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

కలెక్టర్‌కు ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్యుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మెకు సిద్ధమని ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్(ఏపీహెచ్‌సీడీఏ) తరఫున కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. ఇన్‌సర్వీసు పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైం బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50శాతం మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని తదితర డిమాండ్లు తెలియజేశారు. అలాగే, పీహెచ్‌సీ వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు ఇవ్వాలని, వైద్యుల జాబ్ చార్టు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించకపోతే గురువారం సమ్మె కార్యాచరణ ప్రకటించి నిరవధిక సమ్మెకు దిగుతామని పీహెచ్‌సీ వైద్యులు స్పష్టం చేశారు.

అడవి బాపిరాజు వర్ధంతి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సాహిత్యం, చిత్రకళ, పాత్రికేయం రంగాలతోపాటు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు అని అతడి చరిత్రను ఈ తరం ప్రజానీకం ఎంతో తెలుసుకోవాలని ఆధ్యాత్మిక తత్వవేత్త అజ్జరపు హరిబాబు అన్నారు. ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో సోమవారం సీతంపేట మాతృ స్వరూపిణి మందిరంలో అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన అడవి బాపిరాజు వర్ధంతి కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. బాపిరాజు రాసిన ఎన్నో పుస్తకాలు పాఠకుల మన్ననలు పొందాయి. స్వాతంత్ర సమరయోధుడిగా జైలు జీవితాన్ని కూడా అనుభవించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘుపాత్రుని సాయిబాబా, రామకృష్ణ, ప్రణవ్, శ్రీపాద సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 40 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారి నుంచి 40 అర్జీలను స్వీకరించి తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

373 మందికి మహిళలకు వైద్య పరీక్షలు



కె.వీరంపాలెంలో మందులు పంపిణీ చేస్తున్న నాయకులు

రంగంపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రంగంపేట, సింగంపల్లి పీహెచ్‌సీల పరిధిలోని పెదరాయవరం, కె.వీరంపాలెం గ్రామాల్లో వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మి, వి.జయవర్ధిని, కె.చిన్నారావుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదరాయవరంలో 217మందికి, కె.వీరంపాలెంలో 156 వెరసి 373 మందికి రక్త పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలువురు మహిళలకు సర్వైకల్, ఓరల్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఆరోగ్యవంతమైన స్త్రీ, శక్తివంతమైన కుటుంబం కోసం శపథం చేద్దామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ వెలుగుబంటి సత్తిబాబు,నాయకులు ఉద్దండ్రావు శ్రీను, వినయ్‌కుమార్, మోదుకూరి గోపాలకృష్ణ, సర్పంచ్ బరగటి సుజాత పాల్గొన్నారు.

శరన్నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ

అనపర్తి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ సుమంత్ అన్నారు. సోమవారం అనపర్తి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దసరా సందర్భంగా భక్తులు భవానీ మాలలు ధరించి పూజా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యే తరుణంలో ఇళ్లలో దొంగతనాలు జరిగే ప్రమాదం ఉన్నందున బంగారం, విలువైన వస్తువులను భద్రపరచుకోవాలన్నారు. మండపాల వద్ద జరిగే పూజా కార్యక్రమాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి నేడు పీ4పై శిక్షణ

బిక్కవోలు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ4పై సచివాలయ సిబ్బందికి మంగళవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం బలభద్రపురం, బిక్కవోలు, ఇళ్లపల్లి, రంగాపురం, కాపవరం గ్రామాల్లోని సిబ్బందికి మధ్యాహ్నం కొమరిపాలెం, కొంకుదురు, మెళ్లూరు, ఆరికరేవుల, పందలపాక, తొస్సిపూడి గ్రామాల్లోని సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు.



జగజ్జననికి నీరాజనం

మొదలైన శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా మొదలయ్యాయి. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని శ్రీబాలా త్రిపుర సుందరిదేవిని తొలిరోజు స్వర్ణకవచ కనకదుర్గగా దర్శనమిచ్చారిలా.. అక్కడ విద్యుత్ దీపాలంకరణ దృశ్యం..

సెంట్రల్ జైలు ఖైదీ పరారీ

మూత్ర విసర్జన కోసమంటూ సంకెళ్లతో సహా మాయం

8



ధాన్యం సేకరణ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

పన్ను తగ్గింపా.. పండుగ ఆఫరా..



కాకినాడలో ఓ షోరూమ్‌లో అమ్మకాలు





అంతా అయోమయం!

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించిన విషయం తెలిసిందే. అయితే ఆ తగ్గింపు కొనుగోలు దారుకు లాభం చేకూర్చడం ఇప్పుడు చిక్కుముడిగా మారింది. జీఎస్టీ తగ్గక ముందు ఎంత ధర, తర్వాత ఏ మేరకు తగ్గిందనే విషయాలు దుకాణాల్లో ఎక్కడా కనబడడం లేదు. తొలిరోజు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అయితే అంతా అయోమయమే కనిపించింది. అసలే అసలు ధరను అమాంతం పెంచేసి భారీ తగ్గింపును చూపిస్తుంటారు. ఇప్పుడు కూడా ఆ మాదిరిగానే ధరలు ఉండడంతో జీఎస్టీతో తమకు ఏమి ఒరిగిందో వినియోగదారుడికి బోధపడడం లేదు. ఇక మార్కెట్‌లోనూ దసరా పండుగ ఆఫర్లు ప్రారంభించేశారు. దీంతో జీఎస్టీ తగ్గింపు ఎంత మేర, పండుగ ఆఫరు ఎంత డిస్కౌంటు అనే అంశాలు కలగాపులగంగా మారిపోయాయి.

- దసరా ఆఫర్లో కొట్టుకుపోయిన జీఎస్టీ తగ్గింపు ధరలు
- ట్యాక్స్ ఎంత మేర తగ్గిందో షాపుల్లో చూపని వైనం
- కొన్నిచోట్ల పాత స్టాకు పేరుతో దోపిడీ
- తొలిరోజు మార్కెట్‌పై ప్రభావం నిల్

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ/సామర్లకోట/తుని - ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ తగ్గింపు ప్రభావం దసరా ఆఫర్ల మధ్య కనిపించకుండా పోయింది. వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌కు దసరా ఆఫర్లు ప్రకటించారు. సోమవారం నుంచి జీఎస్టీ 2.0 అమలులోకి వచ్చినా పెద్దగా ధరలు తగ్గినట్టు కనిపించలేదు. కొన్ని వస్తువులకు మొత్తం జీఎస్టీ తీసేయడంతోపాటు కొన్నింటికి 5 శాతానికి పరిమితం చేయడంతో ధరల్లో స్పష్టమైన తేడా కనిపించాలి. కానీ ఏ షాపుల వద్దా కనీసం తగ్గింపు బోర్డులు పెట్టలేదు. ప్రభుత్వం బోర్డులు పెట్టాలని ముందే స్పష్టం చేసింది కూడా. ఇక దసరా పండుగ ఆఫర్లలో ఎక్కువగా టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లను ఏటా కొంటారు. వీటిపైనా జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో ఐదు స్లాబులుగా ఉన్న పన్నులను 5, 12 శాతాలతో రెండు స్లాబులకు తీసుకొచ్చింది. దీనిలో కార్ల నుంచి బిస్కట్ల వరకూ దాదాపు 375 వస్తువులను ఈ రెండు శ్లాబుల్లోకి తేగా, కొన్నింటికి సున్నా చేసింది. అయితే ఆ మేరకు వినియోగదారుడికి ఎంత లబ్ధి చేకూరిందో ఏ వస్తువుపై కూడా ఉండడం లేదు. ఉదాహరణకు ఆన్‌లైన్‌లో ఓ కంపెనీ 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీ ధర రూ.59,999గా చూపించి ఏకంగా రూ.30,001 రాయితీ ఇచ్చేస్తున్నారు. మరో కంపెనీ వాస్తవ ధరను రూ.73,990గా చూపించి ఏకంగా రూ.50 వేల డిస్కౌంటును ఇచ్చేస్తోంది. అసలు వాస్తవ ధర నిజమైనదేనా? జీఎస్టీ ఎంత తగ్గింది? పండుగ ఆఫరు ఎంత ఇచ్చారు? అనే అంశాలపై స్పష్టత కరువైంది. ఇక మార్కెట్‌లో కిరాణా తదితర సరుకుల విషయంలో కూడా ఇదే నడుస్తోంది. కొందరు వ్యాపారులు పాత స్టాకు, పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నామంటూ ధరలు తగ్గించకపోవడం గమనార్హం. కార్లకు మాత్రం వారం రోజుల నుంచి రూ.50 వేల నుంచి లక్షకుపైగా తగ్గినట్టు చెబుతున్నారు. టీవీలు, ఏసీలకు రూ.1500 నుంచి 3 వేల మాత్రమే తగ్గినట్టు కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధరలు దసరా ఆఫర్ల కింద ముందుగా ప్రకటించినవే. మాల్స్‌లోనూ ఇదే పరిస్థితి. అధికార యంత్రాంగం కదిలితే జీఎస్టీ తగ్గింపు మార్పు కనిపించే అవకాశం ఉంది. చిల్లర దుకాణాల్లో అసలు బిల్లులు ఇవ్వరు కాబట్టి అసలు ధర ఎంతో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌పై ప్రజలు ఎగబడడం వంటిదేమీ కనిపించలేదు. అయితే కాస్త స్పష్టత వచ్చాకే ఏదైనా కొనుగోలు చేయాలనే యోచనలో ఎక్కువ మంది వినియోగదారులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో తొలి రోజు ప్రభావం ఏమీ లేదు.

ఒకటి రెండ్రోజుల్లో మారతాయి...

జీఎస్టీ తగ్గింపు ధరల్లో తొలిరోజు గందరగోళం నెలకొనగా, ఒకటి రెండ్రోజుల్లో దాని ప్రభావం ఉంటుందని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి పాల ధరలు తగ్గిస్తున్నట్టు ఇప్పటికే చాలా కంపెనీలు ముందస్తుగా ప్రకటించాయి. అయితే మార్కెట్‌లో ఆ మేరకు తగ్గింపుతో కొందరు విక్రయాలు చేసినా, చాలాచోట్ల పాత ధరతోనే విక్రయించారు. ఇదేమని అడిగితే ప్యాకింగ్‌లో ఉండే మిస్టేక్ వల్ల సవరణ జరగలేదని అమలాపురంలో ఒక పాల వ్యాపారి చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో సవరణలు జరుగుతాయని సదరు కంపెనీ వారు చెప్పినట్టు తెలిపారు. వాస్తవానికి పాల ధర లీటరుకు రూ.2, నెయ్యి, పనీర్, బట్టర్ వంటి ఉత్పత్తులపై రూ.15 నుంచి రూ.30 మేర వస్తువును బట్టి తగ్గించారు. ఇక నిత్యావసర వస్తువులపై 18 శాతం ఉంచి ధరలను 5 శాతానికి తగ్గించినప్పటికీ కిరాణా, ఇతర ఉత్పత్తులపై ఇంకా తగ్గింపు అమలుచేసేందుకు వ్యాపారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. గతంలో తాము జీఎస్టీ చెల్లించి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిన వస్తువుల ధరలను తగ్గిస్తే నష్టపోతామనే భయంతో పాత రేట్లతోనే వసూలు చేస్తున్నారు. వెంటనే అధికారులు తనిఖీలకు సిద్ధం కాకపోతే ఇంకొంతకాలం పాత ఎమ్మార్పీలతో విక్రయించే అవకాశం ఉంది.

తగ్గితే పండగే..

జీఎస్టీ తగ్గింపుతో సుమారు 375 రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గాయి. ముఖ్యంగా ఎఫ్‌ఎంసీజీ, వాహన, ఎలక్ట్రానిక్, డెయిరీలు, పాల ఉత్పత్తులపైనా ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. సెలూన్లు, వ్యాయామ-యోగా కేంద్రాలపై, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, సబ్బుల వంటి వ్యక్తిగత సౌందర్య ఉత్పత్తులపై పన్ను 18 శాతం నుంచి 5 శాతం తగ్గింది. జీఎస్టీ తగ్గుదలతో ప్రతి కుటుంబానికి వేలాది రూపాయలు ఆదా జరుగుతుందని కేంద్రం చెబుతోంది. నిజానికి పూర్తిస్థాయిలో ధరల తగ్గింపు అమలు జరిగితే ప్రజలకు లాభదాయకమే.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు : ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేదలు, మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని అమ్మవారిని సోమవారం ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ సరళీకృతం వల్ల ధరలు తగ్గి రైతులకు ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

ఖరీఫ్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం : కలెక్టర్

- ఖరీఫ్ సీజన్‌లో 5.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా
- అక్టోబరు 10 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి సన్నాహాలు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఖరీఫ్ సీజనులో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణ సన్నాహక సమావేశం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ సీజనులో 5.31 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, అయితే అందులో 4లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. గత ఖరీఫ్ సీజనుతో 2.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని గుర్తుచేస్తూ ఈసారి అక్టోబరు 10 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,389 (100కిలోలకు), సాధారణ రకం ధాన్యానికి రూ.2,369 కనీస మద్దతు ధరగా నిర్ణయించారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 74 శాతం పంట నమోదు పూర్తయిందని, మిగిలినవి తక్షణమే పూర్తిచేయాలని సూచించారు. గత సీజనులో 221 రైతు సేవా కేంద్రాల ఏర్పాటుచేశారని, ఈసారి పంట దిగుబడి అంచనాల ఆధారంగా కేంద్రాల సంఖ్య నిర్ణయిస్తామన్నారు. గన్నీ బ్యాగ్‌లు కనీసం 10 రోజుల ముందుగానే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆకస్మిక వర్షాల కారణంగా రైతుల నష్టపోకుండా వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో టార్పాలిన్లు అందించాలన్నారు. ప్రతి కొనుగోలు కేందంలో టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ పరికరాలు తప్పనిసరిగా అమర్చాలని, మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలన్నారు. రైతులకు నేరుగా ఆన్‌లైన్ చెల్లింపుల జరగనున్నాయన్నారు. ధాన్యం సేకరణలో అవినీతి, మధ్యవర్తుల జోక్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్వో సీతారామ మూర్తి, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ నా దేవుడు : అనుశ్రీ



మీడియాతో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : 'జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నా దేవుడు. మళ్లీ రాజకీయ పునర్జన్మ ఇచ్చారు. నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయను. పార్టీని మరింత బలోపేతం చేస్తానని' జనసేన రాజమండ్రి అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ(అత్తి) సత్యనారాయణ స్పష్టం చేశారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు పార్టీ పెద్దలు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, జనసేన నేత హరిప్రసాద్ అండగా నిలబడ్డారని, రాజకీయంగా సహకరించారని తెలిపారు. కష్టకాలంలో కూడా తన వెంటే ఉన్న వారందరినీ మర్చిపోలేనని చెప్పారు. నూటికి నూరుశాతం సిటీలో జనసేనను బలోపేతం చేస్తానని, మేయర్ అభ్యర్థి ఎవరనేది తమ అధినేత నిర్ణయం తీసుకుంటారని ఆయన స్పష్టంచేశారు. తాను ఎప్పుడూ కూటమిలో బాధ్యతగా వ్యవహరించానని, ఇక ముందు అలానే ఉంటానని, పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతానని ఆయన వివరించారు. సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో 178 అర్జీల స్వీకరణ

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ కీర్తి హెచ్చరిక

సీజన్ వ్యాధుల నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు.. ప్రజలూ జాగ్రత్త వహించాలని సూచన



అర్జీదారుని సమస్య వింటున్న కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం కలెక్టరేట్‌లో తొలిసారిగా పీజీఆర్‌ఎస్‌కు హాజరయ్యారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాగిన ఈ గ్రీవెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జవాబుదారీతనం కలిగిన పౌరసేవలు అందించే క్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను ఆమె హెచ్చరించారు. ప్రజలు ఎటువంటి వ్యయప్రయాసలకి లోను కాకుండా ఇంటి వద్దనే ఉండి తమ సెల్‌ఫోన్ ద్వారా 1100 టోల్‌ఫ్రీ నెంబరుకి కాల్‌చేసి తమతమ అర్జీల స్థితి తెలుసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ కీర్తీ చేకూరి మాట్లాడారు. శానిటేషన్ నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. వాటర్ ట్యాంకుల శుభ్రత, చెత్త నిల్వలు తొలగింపు వంటి చర్యలను పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లను చేపట్టాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌లో మొత్తం 178 అర్జీలు వచ్చినట్టు చెప్పారు.

విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ.. కలెక్టర్‌కు వినతిపత్రం



తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు.. (పైన) కలెక్టర్ కీర్తికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ, డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపుమేరకు విద్యుత్ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. తొలుత స్థానిక ఈపీడీసీఎల్ సర్కిల్ ఆఫీసు వద్ద నుంచి కోటిపల్లి బస్టాండ్, ఆల్కాట్ గార్డెన్స్, బాలాజీపేట మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రాజమండ్రి సర్కిల్‌లోని అన్ని డివిజన్ల యూనియన్లు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం జేఏసీ జిల్లా ఛైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు, కోఛైర్మన్ పి.రామారెడ్డి, డివిజన్ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు, కన్వీనర్ కె.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు.

వెంకటనగరం పంపింగ్ స్కీమ్‌కు రూ. 2.46 కోట్లు

జీవో ఇచ్చిన ప్రభుత్వం : అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): న్యూ వెంకటనగరం పంపింగ్ స్కీమ్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల కోసం 2025-26 సంవత్సరానికి రూ. 246.52 లక్షలకు పరిపాలనాపరమైన అనుమతులిస్తూ సోమవారం ప్రభుత్వం జీవో ఇచ్చినట్టు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. తాను ఇంతకుముందు ఈ పథకం దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని, దీని పరిధిలో 10 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, అందులో 6 వేల ఎకరాల ఆయకట్టు తమ నియోజకవర్గంలోనే ఉందన్నారు. పంప్‌హౌస్ స్టేజ్, 1,2,3ల ఓఅండ్‌ఎం కోసం రూ.194.86 లక్షలు, కాలువ కోసం రూ.15.66 లక్షలు కేటాయించినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో ఈ పంపు స్కీమ్ బాగుచేయించి, ఆయకట్టును పూర్తిగా సాగులోకి తీసుకొచ్చి రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు.

నన్నయ వర్సిటీ అక్రమాలపై విచారణ జరిపించండి

రాజానగరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చండి.. మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే బత్తుల వినతి



రాజమహేంద్రవరం/కోరుకొండ సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రత్యేక టీమ్‌తో విచారణ చేయించి, కారకులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. సోమవారం లోకేశ్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే బలరామకృష్ణ నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరిస్తూ నియోజక వర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందివ్వాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. వీటికి ఆయన సానుకూలం స్పందించినట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. రాజానగరం, కోరుకొండ ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటుచేయాలని, గాదరాడ, శ్రీకృష్ణపట్నం, దివాన్‌చెరువు, రాజానగరం ప్రాంతాల్లో ఇంటర్ కాలేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. పుణ్యక్షేత్రం, గాడాల తుంగపాడు, వెదుళ్లపల్లి, గ్రామాల్లో ప్లస్ 2 నుంచి జూనియర్ కాలేజీగా మార్చాలన్నారు. కాకినాడ, రాజమండ్రి నగరాలకు మధ్యన ఉన్న రాజానగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐలు ఏర్పాటుచేసి వృత్తి విద్య ద్వారా కూడా యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. రాజానగరంలో ఎస్టీపీఐ, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటుచేయాలని, ముక్కినాడ, రాధేయపాలెం గ్రామాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేయాలన్నారు.

పవన్‌తో భేటీ



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం అమరావతిలో భేటీ అయ్యారు. సీతానగరంలో రెండు హైలెవల్ వంతెనల నిర్మాణాలకు రూ.10.5 కోట్లు నిధులు మంజూరు చేయాలని, సమగ్ర గ్రామీణాభివృద్ధి ప్రణాళికలో భాగంగా సీసీ రోడ్లకు రూ.148 కోట్లు, అంతర్గత డ్రైన్లకు, పుంతరోడ్లకు రూ.95.5కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు. ప్రతీ ఇంటికి మంచి నీటి సరఫరా కోసం రూ.682 కోట్లు ఇవ్వాలని, పుష్కరప్లాన్‌లో పంచాయతీ రోడ్లకు రూ.53.5 కోట్లు ఇవ్వాలన్నారు. వీటిపై పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించినట్టు బత్తుల వివరించారు.

ఆక్వా రైతులంతా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా రైతులంతా ఏపీఎస్‌డీఏ చట్టం -2020 ప్రకారం తమ చేపల చెరువుల వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయించుకోవాలని, అక్టోబరు 15వ తేదీ చివర గడువు అని కలెక్టర్ డాక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం చేసిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ గడువులోపు లైసెన్స్ పొందకపోతే చెరువులకు విద్యుత్ రాయితీ రాదన్నారు. జిల్లాలో మొత్తం 3163 ఎకరాల ఆక్వా సాగు ఉందని, వీటిలో 2178 ఎకరాలకు 523 మంది రైతులు లైసెన్సులు పొందగా, 984 ఎకరాల కోసం 314 మంది లైసెన్స్‌లు పొందాలన్నారు. మత్స్య శాఖ దీన్ని పూర్తిచేయాలని ఆదేశించారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వినతి



మంగళగిరిలో ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. ఈమేరకు సోమవారం మంగళగిరిలో రాష్ట్ర హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ డిపార్టుమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2027 సంవత్సరంలో గోదావరి నదికి రానున్న పుష్కరాలను పురస్కరించుకుని నియోజకవర్గానికి లక్షలాదిగా యాత్రికులు రానున్నారు. అందువల్ల అసంపూర్తిగా నిలిచిన 14 హెల్త్‌సెంటర్ల నిర్మాణానికి రూ.3.71 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే చాగల్లు మండలం అమ్మిగుంటలో 1, తాళ్లపూడి మండలం పెద్దేవంలో 1, కొవ్వూరు పట్టణంలో ఒక్కొక్కటి రూ. 3 కోట్లు చొప్పున మూడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

జీతాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కొవ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సోమవారం ఉదయం విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు ఒకటి, రెండు తేదీల్లో జీతాలు చెల్లిస్తున్నప్పటికీ కొవ్వూరు మున్సిపాల్టీలో మాత్రం దానికి విరుద్ధంగా విడుదల చేస్తున్నారన్నారు. గత నెల ఒకటో తేదీన చెల్లించాల్సిన వేతనాలు ఈనెల 22వ తేదీ వచ్చినా చెల్లించకపోవడంతో కార్మికులంతా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు, ఈఎమ్ఐ, పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించాల్సి ఉందన్నారు. తక్షణమే బకాయిపడ్డ వేతనాలను చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణ, వైద్యులు

నిడదవోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబమంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని తాళ్లపాలెం సర్పంచ్ యర్రా రామకృష్ణ అన్నారు. సోమవారం గ్రామంలో స్వస్థ నారీ స్వసక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబం) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరం ప్రారంభించిన సర్పంచ్ యర్రా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 2వ తేది వరకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తుందని అన్నారు. ముఖ్యంగా మహిళలు, కిశోర బాలికలను, గర్భవతులను, బాలింతలను ఆరోగ్యంగా ఉంచే ఉద్దేశంతోనే ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నారన్నారు. గ్రామంలో మహిళలంతా ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. వైద్యశిబిరంలో డాక్టర్ వైస్య జన, బీజేపీ నేత పి.శివయ్య, జనసేన నాయకులు శింగులూరి సతీష్, వైద్య సిబ్బంది కేకే సుభాషిణి, లక్ష్మీబాయి, పోలినాటి సతీష్, ఆనంద కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రులు

● పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, మండపాల్లో ప్రారంభం ● మహిళల ప్రత్యేక పూజలు



కొవ్వూరులో దర్శనమిస్తున్న కొవ్వూరమ్మ

కొవ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో దసరా శరన్నవరాత్రులను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గోష్పాదక్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయం, జ్ఞానసరస్వతి అమ్మ వారి ఆలయం, సంస్కృత పాఠశాలలోని లలితాపార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామి ఆలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికుల ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయం ఎదుట కనకదుర్గమ్మ ఆలయం, మెరకవీధి, లాంచీల రేవు కనకదుర్గమ్మ ఆలయాలు, మెయిన్‌రోడ్డు లోని గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయంలో, రామా సొసైటీ సమీపంలో యూత్ ఆధ్వర్యంలో, ఇందిరమ్మ కాలనీలో, రెల్లిపేట నూకాలమ్మ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

కొవ్వూరు మండలంలో ...

పశివేదల తూర్పుకాపుల వీధిలోని శ్రీదుర్గా మహేశ్వర ఆలయం వద్ద దేవీ నవరాత్రులను ఆలయ ధర్మకర్త అళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో తుంపల్లి ఆదినారాయణ, సొసైటీ అధ్యక్షులు గారపాటి రామచంద్రరావు, గారపాటి శ్రీనివాసరావు, బేతిన నారాయణ, ఆలయ కమి టీ సభ్యులు పాల్గొన్నారు. వాడపల్లి గ్రామదేవతలు పుట్టాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆల యంలోనూ ఉత్సవాలు ప్రారంభించారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కుమారదేవం గండిపోచమ్మ వారి ఆలయం, సీతంపేట సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం, దొమ్మేరు, వేములూరు, పంగిడి లోనూ ఉత్సవాలను ఘనంగా ప్రారంబించారు. వాడపల్లిలో విజయదుర్గాదేవిని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ సందర్శించి పూజలు నిర్వహించారు.

తోగుమ్మిలో..

తోగుమ్మి, కొత్తపేటలో వేంచేసిన విజయ కనకదుర్గమ్మ వారి ఆలయంలో దేవీశరన్నవరాత్రు లు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు ఏలూరిపాటి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు గోదావరి, కృష్ణ, తుంగభద్ర, గంగా, త్రివేణి సంగమం నుంచి తీసుకువచ్చిన పుణ్య నదీ జలాలతో అష్టోత్తర శత కలశాభిషేకాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారి గ్రామోత్సవం, పంచామృతాలు, పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు 108 కళశాలతో తీసుకువచ్చిన దివ్య జలాలతో అభిషేకించారు. మాజీ వైస్ ఎంపీపీ మద్దిపాటి సత్యనారాయణ పూజలు నిర్వహించి, ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో అమ్మవారి దేవీ నవరాత్రి మహోత్సవాలను సోమవారం ప్రత్యేక పూజలతో ఘనంగా ప్రారంభించారు. దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీ దేవులపల్లి వం శస్తులు వైదిక స్మార్త ఆగమ ఆచారం ప్రకారం కలశ స్థాపనతో ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక సహస్రనామ పూజలు, చండీ పారాయణం సాయంకాలం హోమం నిర్వహించారు. ప్రత్యేక స్వర్ణాభరణాలు, ప్రత్యేక పూల అలంకరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వీ.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెం బర్ దేవులపల్లి రవిశంకర్ పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలో దేవీ నవరాత్రులు సోమవారం ప్రారంభమయ్యాయి. చాగల్లు గ్రామదేవత పాటెమ్మవారి ఆలయంలో కలశ స్థాపనలో మాజీ ఎంపీ కేతా సాహెబ్ దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. తిరుమల విద్యాసంస్థల ప్రతినిధి నున్న సురేష్ అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం లలిత సహస్రనామ పారాయణం జరిగింది. మెయిన్ రోడ్డులోని కనకదుర్గమ్మ వారి ఆలయం, పాటెమ్మపేటలో ఏర్పాటు చేసిన బాల కనకదుర్గమ్మ వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్థానిక యువకులు ఉత్సాహంగా అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. సెంటర్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ ఉత్సవాల సందర్భంగా మహిళా భక్తులు గీతా పారాయణం చేశారు. ఊనగట్లలోని కనకదుర్గమ్మవారి ఆలయంలోనూ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళ్లపూడి: అన్నదేవరపేట బీసీ కాలనీలోని కనకదుర్గ ఆలయంలో దసరా నవరాత్రులను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఉత్సవ రమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పెద్దింటి భార్గవ్ కలశస్థాపన, పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే వేగుళ్లమ్మతల్లి ఆలయం వద్ద కూడా ప్రారంభించారు. వేగేశ్వరపురంలో విజయ దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలను టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కే. పరశురామారావు హాజరై ప్రారభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం: దసరా నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు సోమవారం స్థానిక కనకదుర్గమ్మ వారు బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరపల్లి: మండలంలో దేవీ నవరాత్రి మహోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. మూడు బొమ్మల సెంటర్ వద్ద ఉన్న సౌభాగ్య దుర్గాంబిక ఆలయం, బాల దుర్గమ్మ ఆలయం వద్ద, పల్లపువీధి రామాలయం వద్ద, నిమ్మలపాడు దిబ్బ వద్ద అమ్మవారిని బాలత్రిపురసుందరిదేవిగా అలంకరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దేవరపల్లిలో బాలత్రిపుర సుందరిదేవిగా..

నేడు స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

కొవ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, చికిత్స అందజేస్తారన్నారు. కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

‘సీఎంఆర్‌ఎఫ్ .. పేదలకు ఆరోగ్యప్రదాయిని’



చెక్కులు పంపిణీ చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు రామచంద్రరావు, టీడీపీ నేతలు

కొవ్వూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలకు ఆరోగ్య ప్రదాయిని అని పశివేదల సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు అన్నారు. పశివేదలలో సోమవారం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఇందులో పాలకుర్తి తులసీకి రూ. 42,000, నిమ్మగడ్డ పద్మావతికి రూ. 60,000 మంజూరయ్యాయి. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందడం సంతోషకరమన్నారు. గారపాటి శ్రీనివాసరావు, బేతిన నారాయణ, తుంపల్లి ఆదినారాయణ, ఆలపాటి సాయికృష్ణ, ఉండవల్లి గోపాల్, మీపాల శ్రీనివాస్, గార శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ పీజీఆర్‌ఎస్‌కు తొమ్మిది ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో రాణీసుస్మిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజనల్ పీజీఆర్‌ఎస్‌కు తొమ్మిది ఫిర్యాదులు అందాయి. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పరిష్కారవేదికలు ఏర్పాటుచేసి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లి ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీపీ కేవీకే దుర్గారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో నాగార్జునరావు

దేవరపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ఎంపీడీవోగా సీహెచ్ నాగార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా రైల్వేకోడురూలో ఈవోపీఆర్‌డీగా ఉంటూ పదోన్నతిపై ఇక్కడకి వచ్చారు. ఈసందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలాభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంపీడీవో తెలిపారు. ఈవోపీఆర్‌డీ రాజారావు, సూపరింటెండెంట్ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

‘అప్రమత్తంగా ఉండాలి’

ఉండ్రాజవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ డీ. రవికుమార్ హెచ్చరించారు. దసరా నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్లను విడిచి దూరప్రాంతాలకు వెళ్లినపుడు తమ విలువైన వస్తువలను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాబోవు దసరా పండుగ నిమిత్తం స్వంతఊళ్లకు, తీర్థయాత్రలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇంటిని విడిచి వెళ్లేవారు తమ పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని, తద్వారా తమ సిబ్బంది ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని ఎస్సై రవికుమార్ చెప్పారు.

వెలగదుర్రులో వైద్యశిబిరం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెలగదుర్రులో సోమవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్. ఉషాదేవి పాల్గొని సుమారు 172 మంది స్త్రీలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలకు వచ్చే బ్రెస్ట్, గర్భాశయ కేన్సర్లు, మధుమేహం, రక్తపోట్లు వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ బీ. దుర్గామహేశ్వరరావు, స్థానిక నాయకులు ముదునూరి రవీంద్రరాజు, మహేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు’

కొవ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంగిడి గ్రామ శివారు దేచర్లలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు చట్ట విరుద్ధంగా అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల వైస్ ఎంపీపీ వీరమళ్ళ నారాయుడు కలెక్టర్ కీర్తి చేకూరికి పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు.

‘మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి’



చోడవరంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నల్లజర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని డాక్టర్ సిరాజుద్దీన్ అన్నారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పడమర చోడవరంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన, వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబంతో పాటు సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల హిమబిందు, గోపి, మద్దిపాటి సుబ్బారావు, పెండ్యాల రామచంద్రం, వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు చేరిన వీఆర్‌ఏల నిరసన



బొమ్మూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నల్లజర్ల మండల వీఆర్‌ఏలు

నల్లజర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని, అలాగే ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మెన్, డ్రైవర్ పోస్టులను అర్హులైన వారితో భర్తీ చేయాలని కోరుతూ ప్రారంభించిన వీఆర్‌ఏల నిరసన మండల స్థాయి నుంచి ఆర్డీవో కార్యాలయం, చివరికి కలెక్టరేట్ వరకు వెళ్లింది. సోమవారం మండలానికి చెందిన వీఆర్‌ఏలంతా కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని ఆ సంఘం మండలాధ్యక్షుడు షేక్ సర్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దొంగతనం చేసిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నమ్మించి ఇసుక దొంగతనం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. భీమవరానికి చెందిన గూడపాటి రాజశేఖర్ మండలంలోని కుమారదేవంలో ప్రభుత్వం మంజూరుచేసిన దుర్గా వెంకటరమణ సాండ్ ట్రేడర్స్ ద్వారా ఓపెన్ ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తీసుకువచ్చి స్టాక్ పాయింట్‌లో నిల్వచేసి, అక్కడ నుంచి విశాఖ, అనకాపల్లి జిల్లాలలోని ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్‌కు సరఫరా చేస్తున్నారు. కాగా, స్టాక్ పాయింట్ వద్ద భీమవరం పట్టణానికి చెందిన కునిపూడి శ్రీనివాస్ అలియాస్ చిరుత శ్రీనుని ఏపీ ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్ ర్యాంపులో గుమస్తాగా నియమించింది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ తన అల్లుడైన పంపన గణపతికి సొంత లారీలు ఉన్నాయని చెప్పి రాజశేఖర్‌కు పరిచయం చేసి ఇసుక రవాణాకు నియమించాడు. ప్రతిరోజు సాయంత్రం ఆరుగంటలకు స్టాక్ పాయింట్ మూసివేసిన తరువాత ఇరువురు కలిసి సుమారు 196 ట్రిప్పులు రూ. 6,47,881.92 లక్షల విలువైన ఇసుకను మోసగించి స్టాక్ పాయింట్ నుంచి దొంగతనంగా తరలించారు. అంతేకాకుండా ఇసుక రవాణా చేయు నిమిత్తం రాజశేఖర్ వద్ద రూ. 8 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. పంపన గణపతి కుటుంబ అవసరాల నిమిత్తం లారీని దస్తావేజు అగ్రిమెంట్ చేసుకుని మరో రూ. 15 లక్షలు తీసుకున్నాడు. లారీని ఫిర్యాది పేరుపై రిజిస్ట్రేషన్ చేయకుండా రాత్రి సమయంలో లారీని ర్యాంపు నుంచి నవాబుపాలెం తీసుకువెళ్లిపోయాడు. మొత్తం రూ. 30 లక్షల వరకు మోసగించినట్టు ఇరువురిపై రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల నుంచి ..

తప్పించుకొని ముద్దాయి పరార్



బత్తుల ప్రభాకర్ (ఫైల్)

దేవరపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వాయిదా నిమిత్తం విజయవాడ తీసుకెళ్లి, తిరిగి వస్తున్న సమయంలో బత్తుల ప్రభాకర్ అనే ముద్దాయి పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యాడు. దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారి పక్కనున్న గోదావరి రెస్టారెంట్ వద్ద టిఫిన్ చేసేందుకు ఎస్కార్ట్ వ్యాను ఆగింది. ఇదే అదునుగా భావించిన ముద్దాయి మూత్రవిసర్జన కోసం తీసుకెళ్లమని అడిగి తప్పించుకుని పరారయ్యాడు. దీనిపై దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వీ.సుబ్రహ్మణ్యం వివరాలు తెలుపుతూ ముద్దాయి, పోలీసుల నుంచి తప్పించుకున్న సమయంలో హ్యేడ్ కప్స్, వైట్ కలర్ టీషర్టు, బ్లాక్ కలర్ ట్రాక్‌ను ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవాళ్లు 9440796584, 9440796624 ఫోన్‌నెంబర్లకు తెలియజేయాలన్నారు. ఆచూకీ తెలిపినవారికి తగిన పారితోషికం ఇస్తామన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

గోపాలపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్ తగిలి యువకుడు మృతిచెందిన సంఘటన కరిచర్లగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సింగులూరి వీరబాబు (19) ఇంట్లో ఫ్యాన్ వైరు ప్లెగ్గులో పెడుతుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో స్థానికుల సాయంతో వీరబాబును సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. వీరబాబుకు తండ్రి లేకపోవడంతో పెద్దకొడుకుగా తాను, తన తమ్ముడు కలిసి కష్టపడుతూ తల్లిని పోషిస్తున్నట్టు తెలిపారు. పెద్దకుమారుడు మృతిచెందటంతో కుటుంబ భారమంతా తన సోదరుడిపై పడుతుందన్నారు.

నేడు పీ4పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

బిక్కవోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ4పై సచివాలయ సిబ్బందికి మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వీ. శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం బలభద్రపురం, బిక్కవోలు, ఇళ్లపల్లి, రంగాపురం, కాపవరం గ్రామాల్లోని సచివాలయ సిబ్బందికి, మధ్యాహ్నం కొమరిపాలెం, కొంకుదురు, మెళ్లూరు, ఆరికరేవుల, పందలపాక, తొస్సిపూడిలోని సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు.

ఘనంగా భౌతిక, రసాయన శాస్త్రవేత్త జయంతి



మైఖేల్ పరడే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): భౌతిక, రసాయన శాస్త్రవేత్త మైఖేల్ పరడే 235వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ డిపార్టుమెంట్ల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా. ఎం. రామ్మోహన్‌శాస్త్రవేత్త మైఖేల్ ఫరడే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.యల్లాప్రగడ రమేష్, ఫిజిక్స్ హెచ్‌వోడీ అజ్జరపు శ్రీనివాస్ మాట్లాడుతూ పరడే ఎలక్ట్రిసిటీకి పితామహుడన్నారు. అధ్యాపకులు బీ. సత్యనారాయణ, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఏబీఎన్ కళాశాలలో వర్క్‌షాప్

కొవ్వూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం రసాయనశాస్త్రం, లైఫ్ సైన్సెస్ విభాగంలో ఆధ్వర్యంలో దేశీయ సంరక్షణ ఉత్పత్తులపై నైపుణ్యాభివృద్ధి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. రామ్మోహన్ తెలిపారు. మంగళవారం ఉదయం 10-30 గంటల నుంచి ఈ వర్క్‌షాప్ ప్రారంభమవుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.యల్లాప్రగడ రమేష్ మాట్లాడుతూ క్లీనింగ్ పౌడర్‌లు, డిటర్జెంట్, వ్యక్తిగత సంరక్షణ వస్తువులు వంటి సురక్షితమైన పర్యావరణ అనుకూలమైన, స్వల్ప ఖర్చుతో కూడుకున్న గృహ సంరక్షణ ఉత్పత్తులను ఎలా తయారు చేయాలో విద్యార్థులకు ఆచరణాత్మకంగా నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల పీజీ డైరెక్టర్ చలపతిరావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ప్రకటించాలి

తాళ్లపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) డిమాండ్ చేసింది. ఏపీజీఈఏ రాష్ట్ర కమిటీ పి లుపులో భాగంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని తాళ్లపూడి మండల పరిషత్ కార్యాయలంలో సోమవారం నిర్వహించారు. దీనికి పోలవరం తాలూకా శాఖా అధ్యక్షుడు వేణ్ణి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, కొవ్వూరు శాఖా నాయకుడు ఎం.కృపావరం వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పీ. గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఇప్పటి వరకూ 15 పీఆర్‌సీలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 11 మాత్రమే విడుదల చేయడం అన్యాయమన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కే. వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి, తదితరులు మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్లకు సన్మానం

తాళ్లపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రత అనేది పారిశుధ్య కార్మికులపై ఆధారపడి ఉంటుందని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ అన్నారు. పెద్దేవంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అప్పన హనుమంతరావు, గెడ్డం సాయిబాబా, తిగిరి పల్లి వెంకట్రావు, తోటరామకృష్ణ, తదితర సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

తాళ్లపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలో గేదెలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని, వారికి తగిన నష్టపరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

నిడదవోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ మొదటి వీధిలో సోమవారం దాదాపు 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఈ వ్యక్తి బహుశా అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై అనుమానాస్పద మృతికేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ జగన్మోహనరావు తెలిపారు.